ప్రజాశక్తి
మంగళవారం 30 జనవరి 2024
8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా





పాత అంశాలే మళ్లీ అజెండాలోకి

● విపక్షాల ఆగ్రహం ● నేడు విఎంసి కౌన్సిల్ సమావేశం
● వ్యూహ ప్రతివ్యూహాల్లో అధికార, విపక్ష పార్టీలు



ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అధ్యక్షతన జరిగే ఈసమావేశంలో ప్రధాన అజెండాతోపాటు సప్లమెంటరీ అజెండాలో మొత్తం 103 అంశాలను పొందుపర్చారు. అయితే సమావేశం జరిగే సమయములో అత్యవసర అంశాల పేరుతో మరికొన్ని అంశాలు వచ్చే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే అజెండాపై అధికార వైసిపి, విపక్ష టిడిపి, సిపిఎంలు విడివిడిగా చర్చించి, వ్యూహ ప్రతివ్యూహాలపై రూపొందించుకున్నాయి. అజెండాలోని అంశాలపై నగర మేయర్ విఎంసిలోని ఆయా విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించారు. గత కౌన్సిల్ అజెండాలో తీర్మానించిన అంశాలు ఏ మేరకు పరిష్కారం అయ్యాయి, అలాగే ప్రస్తుతం నగర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అధికార వైసిపిని విపక్ష టిడిపి, సిపిఎం నిలదీయనున్నట్లు సమాచారం. సర్కిల్-1 వన్‌టౌన్ 43వ డివిజన్ పరిధిలోని లారీ స్టాండ్ ఐరన్ యార్డులో జిఐ ప్రొఫైల్ సీట్‌తో 36 షెడ్లును ఏర్పాటు చేయడానికి కోటీ 55 లక్షల 70 వేల రూపాయల సాధారణ నిధులను ఖర్చు చేసే విధంగా, 2.675 శాతం తక్కువ కోడ్ చేసిన కొల్లి కోటిరెడ్డి అనే కాంట్రాక్టర్‌కు గత ఏడాది జూలై 31న జరిగిన కౌన్సిల్ సమావేశంలో వర్క్ ఆర్డర్ ఇస్తూ తీర్మానించారు. కానీ ప్రస్తుతం ఇదే అంశం మళ్లీ కౌన్సిల్ అజెండాలోకి రావడం పట్ల విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. విఎంసి స్థలంలో షెడ్లను లారీ స్టాండ్ వారు ఏర్పాటు చేసుకుంటే, వాటిపై రావాల్సిన ఆదాయం ఏమౌతుందని పలువురు కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. దీనిపై స్పష్టత లేదని అంటున్నారు. అలాగే నగరంలో వీధి కుక్కల నియంత్రణకు అవుతున్న అంచనా వ్యయాన్ని పెంచడంతోపాటు మేయర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అడహక్ కమిటీని పరిగణలోకి తీసుకోకపోతుండటాన్ని విపక్షాలు తప్పుపడుతున్నాయి. ఎబిసి ఆపరేషన్లు, ఫ్రీ అండ్ పోస్టు కేర్ సర్వీసులకు ఒక్కో వీధి కుక్కకు రూ.1500 చొప్పున రూ.1.25 కోట్లను సాధారణ నిధుల ఖర్చు చేయాలని, హైదరాబాద్‌కు చెందిన ఎం/ఎస్ నవోదయ వెట్ సొసైటీకి ఈ పనులను ఈ టెండర్ ద్వారా అప్పగించాలని అజెండాలోకి ప్రతిపాదన వచ్చింది. అయితే ఇదే అంశానికి సంబంధించి 12 వేల కుక్కలకు ఎబిసి, ఎఆర్‌వి కార్యక్రమం చేపట్టడానికి ఒక్కో కుక్కకు రూ.1350 చొప్పున రూ. 1.62 కోట్లు ఖర్చవుతుందని గత జూలైలో జరిగిన కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. ఆ సమయంలో ఈ అంశంపై సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకునేందుకు మేయర్‌తోపాటు విపక్షాల ఫ్లోర్‌లీడర్లు, అధికార వైసిపి నుంచి ముగ్గురు కార్పొరేటర్లు, విపక్షాల నుంచి మరో ఇద్దరు

(మిగతా 6లో)

రాజకీయ అజెండాగా

గుణదల వంతెన

➲ మరోసారి మ్యానిఫెస్టోలోకి ఫ్లైఓవర్
➲ ప్రతిపాదనలకే పరిమితం చేసిన ప్రభుత్వాలు
➲ 15 ఏళ్ల క్రితం పనులు ప్రారంభం
➲ పూర్తి చేయడంలో వైసిపి, టిడిపి నిర్లక్ష్యం



మధ్యలోనే నిలిచిన ఫ్లైవోవర్ (పాతచిత్రం)

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

గుణదల ఫ్లైఓవర్ రాజకీయ అజెండాగా మారిపోయింది. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు దీనిని ఓటు బ్యాంకు అంశంగా మార్చేశాయి. ప్రతి ఎన్నికల్లో దీనిని పూర్తి చేస్తామని చెప్పి ఓట్లు దండుకోవడం, తర్వాత పట్టించుకోకపోవడం రివాజుగా మారింది. గత పదేళ్లుగా ఇదే తంతుగా మారిపోయింది. 2014లో అధికారంలోకి వస్తే పూర్తి చేస్తామన్న తెలుగుదేశం పార్టీ మొండి చేయి చూపింది. ఆ తర్వాత 2019లో ఇదే అంశాన్ని ప్రధాన అజెండాగా లబ్ధిపొంది గెలిచిన వైసిపి కూడా దానిని పూర్తి చేయడంలో చతికిల పడింది. దీంతో నగర వాసులకు గుణదల ఫ్లైఓవర్ ఒక పగటి కలగానే మిగిలిపోయింది.

ఆరేళ్ల తర్వాత ప్రారంభమైన పూర్తయిన కనక దుర్గ, బెంజిసర్కిల్ ఫ్లైఓవర్లు

గుణదల ఫ్లైఓవర్‌కు ఉన్న చరిత్ర ఏ వంతెనకూ ఉండదేమో. ఏ ఫ్లైఓవర్‌కూ ఇన్నేళ్లు పట్టి ఉండవు. దీని తర్వాత మొదలు పెట్టిన కనకదుర్గ, బెంజి సర్కిల్ ఫ్లైఓవర్లు పూర్తయ్యాయి. వీటి కంటే పెద్ద పొడవైంది కూడా కాదు. 2015 నవంబరు 22లో కనకదుర్గ ఫ్లైఓవర్ పనులు మొదలు పెట్టారు. సెప్టెంబరు 2020న దానిని ప్రారంభించారు. దీని పొడవు 2.6 కిలో మీటర్లు. రూ. 458 కోట్లతో చేపట్టిన ఈ ఆరు లేన్ల వంతెనను పూర్తి చేశారు. అలాగే 2016లో బెంజిసర్కిల్ మొదటి ఫ్లైఓవర్‌ను మొదలు పెట్టారు. సెప్టెంబరు 2020న ప్రారంభించారు. 2020లో బెంజిసర్కిల్ రెండో ఫ్లైఓవర్ పనులు మొదలు పెట్టి నవంబరు 2021కి పూర్తి చేశారు. కానీ గుణదల ఫ్లైఓవర్ పనులు ఇంత వరకు పూర్తి కాలేదు. మరోవైపు 2024 ఎన్నికల నేపథ్యంలో ఇదే అంశం తాజాగా ఎన్నికల అజెండాగా మారనుందని పలువురు భావిస్తున్నారు.

నాడు ధర్మాన చేతుల మీదుగా శంకుస్థాపన

15ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ హయాంలో గుణదల నుంచి నున్న వరకు 1.2 కిలో మీటర్ల పొడవున ఫ్లైఓవర్‌ను నిర్మించాలని నిర్ణయించారు. 2009 ఫిబ్రవరి 19న శంకుస్థాపన చేశారు. అదీ కూడా నేటి రెవెన్యూ మంత్రిగా ఉన్న నాటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా దీనికి శంకుస్థాపన కావించడం గమనార్హం. పైగా నాడు ఆయన కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రిగా కూడా ఉన్నారు. రూ.36 కోట్లతో పనులు మొదలు పెట్టారు. 2015 జనవరి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. కానీ 2010లోనే పనులు నిలిచిపోయాయి. దీంతో కథ మొదటికి వచ్చింది.

వైసిపి, టిడిపి నిర్లక్ష్యం

వైసిపి, టిడిపి ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ అంచనా వ్యయాలు కూడా భారీగా పెరిగాయి. నాడు కేవలం రూ.36 కోట్లతో పూర్తి కావాల్సిన పనులకు నేడు రూ.62 కోట్లు అవుతాయని తేల్చారు. మరోవైపు ఇప్పటి వరకు మూడు పర్యాయాలు అంచనా వ్యయాలను లెక్కలేశారు. తొలుత రూ.36 కోట్ల అంచనా వ్యయంతో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత 2021లో రూ.52 కోట్లు అవుతుందని అంచనా వేశారు. తాజాగా ప్రస్తుత రేట్ల ప్రకారం రూ.62 కోట్లు అవుతుందని అంచనా వేసినట్లు సమాచారం. అయినా ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల సుమారు రూ.26 కోట్ల ప్రజాధనాన్ని అదనంగా వెచ్చించాల్సిన దుస్థితి నెలకొందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మున్సిపల్ ఎన్నికల మ్యానిఫెస్టోలో

2021 మార్చిలో మరోదఫా ఈ వంతెన నిర్మాణాన్ని తెరపైకి తెచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వైసిపి, టిడిపిలు అజెండా మార్చాయి. విఎంసిలో వైసిపి పాలకపక్షంగా కొలువుదీరి మూడేళ్లు కావస్తోంది. గుణదల వంతెన మాత్రం మరుగున పడింది. భూసేకరణ, నష్టపరిహారం, బాధితులకు పునరావాసం తదితర అంశాలు నేటికీ ప్రశ్నార్థకంగానే మిగిలిపోయాయి.

విఎంసి నూతన భవనం 2వ అంతస్తు ప్రారంభం



విఎంసి నూతన భవనం రెండో అంతస్తును ప్రారంభిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ దినకర్, ఎంఎల్ఎ వెలంపల్లి

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవన రెండో అంతస్తును సోమవారం మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నల్ దినకర్ పుంకర్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యానికి ఈ భవనం ఒక నిలువెత్తు నిదర్శనమన్నారు. దీనిని తమ ప్రభుత్వ హయాంలో ప్రారంభించుకోగలిగామన్నారు. ఈ రెండో అంతస్తులో ప్రణాళిక, రెవెన్యూ, పిఐ యుసిడి, హార్టికల్చర్, పౌర సంబంధాలు, వెటర్నరీ విభాగాల సిబ్బందికి కేటాయించామని తెలిపారు. రిసెప్షన్ డెస్క్, వెయిటింగ్ హాల్ సదుపాయాలు ఉన్నాయన్నారు. విఎంసి కమిషనర్ స్వప్నల్ దినకర్ మాట్లాడుతూ రెండో అంతస్తు ఎంతో టెక్నాలజీ కలిగి ఉందని, ఆటోమేటిక్ ఎలక్ట్రిసిటీ సిస్టం ద్వారా విద్యుత్ ఖర్చు కూడా ఎంతో తక్కువగా అవుతుందని తెలిపారు. ఎక్కువగా గ్లాస్ మెటీరియల్ వాడటంతో వెలుతురు ఎక్కువగా ఉంటుందని, తద్వారా విద్యుత్‌ను ఆదా చేసే అవకాశం ఉంటుందని అన్నారున. ఎంఎల్ఎ వెలంపల్లి మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో నగరపాలక సంస్థ నూతన భవనం ఉందన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, ఆవుతు శైలజ రెడ్డి, అడిషనల్ కమిషనర్ జనరల్ కే శకుంతల, అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ కేవీ సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, డిసిపి సుబిన్ డిసిఆర్ డి.వెంకటలక్ష్మి పివో యుసిడి రోహిణి, ఎడి హెచ్ శ్రీనివాసులు, విఏఎస్ రవి చంద్, ఇఇ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

దళిత, గిరిజన రైతుల ధాన్యం బకాయిలు చెల్లించాలి

● సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ
● స్పందనలో కలెక్టర్‌కు బాధిత రైతుల వినతి



బాధిత రైతుల తరపున కలెక్టర్ డిల్లీరావుకు వినతిపత్రం అందిస్తున్న డివి.కృష్ణ తదితరులు

ప్రజాశక్తి-విజయవాడ : దళిత, గిరిజన ధాన్యం రైతులకు బకాయిపడిన రూ.11 లక్షలను ప్రభుత్వం మంజూరు చేయాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఎ కొండూరులోని దళితవాడ, తండాలకు చెందిన 14 మంది పేద దళిత, గిరిజన రైతులకు పౌర సరఫరాల శాఖ నుంచి విడుదల కావాల్సిన రూ.11 లక్షలు వెంటనే మంజూరు చేయించాలని కోరుతూ బాధిత రైతులను కలుపుకొని డివి కృష్ణ సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు వినతిపత్రం అందజేశారు. ముందుగా కలెక్టరేట్ వద్ద బాధిత రైతులు నిరసన తెలిపారు. బాధిత రైతులకు మద్దతుగా పాల్గొన్న డివి.కృష్ణ మాట్లాడుతూ వచ్చే శనివారంలోపు బకాయిలు విడుదల కాకపోతే బాధిత రైతులను కలుపుకొని పాదయాత్ర ద్వారా నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ అంశంలో కలెక్టర్ జోక్యం చేసుకోవాలని

(మిగతా 6లో)

బకాయిల మంజూరు చర్యలు : కలెక్టర్ డిల్లీరావు

బాధిత రైతుల బకాయిల మంజూరుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.డిల్లీరావు హామీ ఇచ్చారు. స్పందనలో ఇచ్చిన వినతిపత్రంపై ఆయన స్పందించారు. అక్కడి నుండే సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి ఈ అంశంపై ఆరా తీశారు. తక్షణమే బకాయిల విడుదలకు చొరవ చూపాలని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ డి.రాజును ఆదేశించారు.

పేదలకు అండగా వైసిపి : ఎంపి కేశినేని నాని

ప్రజాశక్తి - వత్సవాయి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ వారికి అండగా ఉంటుంటే.. చంద్రబాబు మాత్రం తన కొడుకును సిఎం చేసేందుకు కష్టపడుతున్నారని విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) ఎద్దేవా చేశారు. సోమవారం వత్సవాయిలో జరిగిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో నాని, ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆయన సతీమణి విమలాభాను పాల్గొన్నారు. ఎంపి నాని మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టి రామారావు పెత్తందారుల కోసమే పనిచేస్తాడని విమర్శించారు. జన్మభూమి కమిటీల ద్వారా పచ్చ చొక్కాల వారికే పథకాలు అందించేవారని అన్నారు. ఉదయభాను మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్కా చెల్లెమ్మలను మోసం చేశారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక నాలుగు దఫాలలో రుణమాఫీ చేసి మహిళల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. విమలభాను మాట్లాడుతూ మహిళల పక్షపాతిగా నిలుస్తున్న ముఖ్యమంత్రి


ఆసరా చెక్కును అందజేస్తున్న ఎంపి కేశినేని నాని, ఉదయభాను

జగన్మోహన్‌రెడ్డిని మరొకసారి ఆదరించాలని కోరారు. స్థానిక ఎంపిపి కొలుసు రమాదేవి, కొలుసు తిరుపతిరావు జడ్పిటిసి వే ఏసు పోగ దేవమని శ్రీనివాసరావు, తిరుమలగిరి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, మాజీ కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు, తిరుపతమ్మ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ శ్రీనివాసరావు, వచ్చిన సర్పంచి భూక్య సీతమ్మ, భూక్యరాజా నాయక్, మండల సమైక్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష గంగిపోకు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - మైలవరం : జి.కొం డూరు మండలం లోని చెమటూరు గ్రామంలో రూ 43.60 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని స్థానిక ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనా సౌలభ్యంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలను సత్వరం అందించాలనే లక్ష్యంతో దేశంలో ఇప్పటివరకు ఎక్కడా లేనివిధంగా ఏపీ ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థను తెచ్చిందన్నారు. అవినీతికి, వివక్షతకు తావులేని పరిపాలన ప్రజలకు చేరువ కావాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, ఎంపిపి తిరుపతమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రింటర్, స్కానర్ వితరణ

ప్రజాశక్తి - గంపలగూడెం: రూ.22 వేల విలువగల ప్రింటర్, స్కానర్‌ను వితరణ చేసినట్లు స్థానిక కెజీబీవీ ప్రిన్సిపాల్ మోక్షగుండం వెంకటలక్ష్మి తెలిపారు. అమ్మిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వైసిపి మండల నాయకులు మందపాటి ఉమామహేశ్వర్ రెడ్డి, సతీమణి రాధాకుమారి, తన తల్లి నాగేంద్రమ్మ జ్ఞాపకార్థం తమ పాఠశాల అవసరార్థమై అందజేసినట్లు తెలిపారు. స్కానర్, ప్రింటర్‌ను సోమవారం పాఠశాలలో ఉమామహేశ్వర్ రెడ్డి దంపతులు అందజేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుండి వాలీబాల్ టోర్నీ

ప్రజాశక్తి - వీరులపాడు : వీరులపాడుకు చెందిన వట్టి కొండ నాగేశ్వరావు (జగన్నాధం) వర్ధంతి సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ రైతు సంఘం నాయకులు వట్టికొండ చంద్రమోహన్ తెలిపారు. నాగేశ్వరరావు 29వ వర్ధంతి సందర్భంగా మండల స్థాయిలో వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు స్థానిక వాసిరెడ్డి హనుమయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవరి 30, 31 తేదీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ టీమ్ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంట్రీ ఫీజు రూ.300లు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10వేలు దుర్గాప్రసాద్, రెండో బహుమతి రూ.7వేలు వట్టికొండ జ్ఞాపకార్థం వారి తండ్రి వట్టికొండ చంద్రమోహన్, మూడో బహుమతి అప్పసాని పుల్లారావు రూ.5వేలు, నాలుగో బహుమతి రూ.3వేలు అద్దంకి ప్రసాద్ (తొమ్మిదో వార్డ్ మెంబర్) కుమారుడు అద్దంకి ప్రజాపతి అందజేస్తారని తెలిపారు.

వైసిపితోనే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఎ.కొండూరు : రాజకీయాలకు కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని ఎ.కొండూరు ఎంపిపి కాలసాని నాగలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్లో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయన్నారు.

గెద్దం ప్రసాదరావుకు పురస్కారం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గెద్దం ప్రసాద్‌రావు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఎపి జెన్కో సంస్థ ఉత్తమ ప్రతిభ పురస్కారం (బెస్ట్ టాలెంట్ అవార్డు)తో ఘనంగా సత్కరించింది. ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవం వేడుకల్లో భాగంగా ప్రసాదరావుకు, సంస్థ తరుపున డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (సివిల్) రమణ మూర్తి ఉత్తమ ప్రతిభా పురస్కారం, ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించారు.



అవార్డు అందుకుంటున్న ప్రసాదరావు

మాధవేంద్రరావుకు పురస్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం, ప్రశంసాపత్రం అందుకున్న చల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావును సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పాలకవర్గ సభ్యురాలు ఉప్పాల వెంకటేశ్వరమ్మ ల సమక్షంలో వైసిపి శ్రేణులు ఘనంగా సోమవారం సత్కరించారు.చల్లపల్లి మండల వైసిపి నాయకులు వెనిగళ్ల తారక జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో చల్లపల్లి పిఏసిఎస్ ఛైర్ పర్సన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), చేనేత సొసైటీ నాయకులు వై.గంగాధరరావు ,అల్లంశెట్టి వెంకట చలం, ఉప్పాల మోహన రంగా,వి.అర్జునరావు , ఆకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 29 వార్డుల్లో మంచినీటి సరఫరా లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, మున్సిపల్ అధికారులు జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిపిఎం కొండపల్లిటౌన్ కార్యదర్శి ఎం.మహేష్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో గాంధీబొమ్మ వద్ద మంచినీటి సమస్య పరిష్కారం కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. విటిపిఎస్ బూడిద మంచినీటి పంపుహౌస్‌లో కలవటంతో కలుషితమవు తున్నాయని ప్రజలు మంచినీటి సరఫరా సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లీకేజీ పైపులైన్లు రిపేర్ చేయాలని, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌లు కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో



ఆందోళన చేస్తున్న స్థానికులు, సిపిఎం నాయకులు

నిర్మించాలని డిమాండ్ చేశారు. మంచినీరు ఫిల్టర్ చేసి కొండపల్లి మున్సిపాలిటీ ప్రజలకు ఇవ్వాలని, సురక్షిత మంచినీటిని ప్రజలకు అందించి ప్రజాఆరోగ్యం కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండపల్లి టౌన్ కమిటీ సభ్యులు ఎ.విఠలరావు, ఇ.కొండలరావు, రామసీతా, బేబీ సరోజినీ, పార్వతీ, నవీన స్థానిక నాయకులు రమణమ్మ, కృష్ణారాయులు, ప్రభుదాస్, గౌరీ, దుర్గా, రాజేశ్వరి పాల్గొన్నారు.

ది లీడర్ అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - నందిగామ : ఫ్యూచర్ లీడర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు చేసిన వ్యక్తులకు ది లీడర్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. నందిగామ చైతన్య కళాశాల ఆవరణలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నందిగామ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి హాజరై అవార్డు గ్రహీతలకు అవార్డులు ప్రదానం చేశారు. సభలో జనసేన సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి, కళాశాల డైరెక్టర్ అమర్ నేని కార్తీక్, ఫౌండేషన్ అధ్యక్షులు కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలపై సరియైన అవగాహన కలిగి ఉండాలని సమాజానికి తమ వంతు సేవచేసే అవకాశాన్ని విధిగా బాధ్యతగా గుర్తించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళా సాంస్కృతిక రంగం నుండి తుర్లపాడుకు చెందిన దాసరి నరసింహారావు (శెట్టి), విద్యారంగం నుండి ఫిజిక్స్ మస్తాన్, యాలము నాగ రామారావు, సామాజిక సేవా రంగం నుండి డాక్టర్ వీరమాచినేని సౌమ్య, తూములూరి ప్రసాద్ బాబు, రాజకీయ రంగం నుండి కంచల గ్రామానికి చెందిన చలమల సౌందర్య,



అవార్డుల ప్రదానంలో రమాదేవి, తదితరులు

ఆరో వార్డు కౌన్సిలర్ షేక్ యాకుబ్ అలీ (కట్టప్ప), విద్యా సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పెనుగంచిప్రోలుకు చెందిన వడ్లమూడి విజయలక్ష్మి అవార్డులు అందుకున్నారు. అనంతరం వక్తృత్వ, డాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులిచ్చారు. జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి, చైతన్య కళాశాల డైరెక్టర్ అమర్నేని కార్తీక్ ఫౌండేషన్ అధ్యక్షులు కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షురాలు సీతారావమ్మ, సభ్యులు ధీరజ్ కుమార్, శ్రీ వల్లి పద్మావతి అమ్మవారి కోలాట బృందం పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్ అందజేత

ప్రజాశక్తి - గంపలగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్ 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం విజయవాడ కలెక్టర్ డిల్లీరావు చేతుల మీదుగా ఒక్కొక్క విద్యార్థి రూ.పదివేలు అందుకున్నట్లు వివరించారు. **తిరువూరు :** తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులకు మలబార్ గోల్డ్ స్కాలర్ షిప్‌కు మెరిట్ ప్రాతిపదికన 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రెబ్బ మురళీకృష్ణ తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.పదివేలు చొప్పున అరుగురికి, రూ.ఎనిమిది వేలు చొప్పున 16 మంది విద్యార్థులకు మొత్తం రూ.1,88,000 స్కాలర్‌షిప్‌లను విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మలబార్ గోల్డ్ యాజమాన్యం పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎకనామిక్స్ అధ్యాపకులు వి.సురేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


గంపలగూడెంలో


తిరువూరులో

బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి - గంపలగూడెం : కొనిజర్ల గ్రామానికి చెందిన తెల్ల మేకల కృష్ణ ఆ గ్రామ ప్రాథమిక సహకార సంఘం సభ్యులుగా కొనసాగుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుని మట్టిఖర్చుల నిమిత్తం మంజూరైన బీమా సొమ్మును వైసిపి నాయకులు బొల్ల కరుణాకర్ రావు సోమవారం అందజేశారు. రూ.10 వేలు మంజూరైనట్లు తెలిపారు. పిఎసిఎస్ చైర్మన్ నంబూరు కృష్ణారావు, సిఈఓ సుభాని, పర్సన్ ఇన్చార్జి వెంకటేశ్వరరావు, తదితరులున్నారు.

శ్మశానం అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం ఆంజనేయపురం గ్రామ శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు జడ్పిటిసి యరమల రామ చంద్రారెడ్డి సోమవారం సర్పంచ్ మామిడి కుటుంబ రావుతో కలిసి ప్రారంభించారు. జిల్లా పరిషత్ నిధులతో శ్మశాన వాటికను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాంబాబు, గ్రామ పెద్దలు జమలయ్య, ఇమామ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - తిరువూరు : రైతు ప్రజా వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరువూరు కోర్టుబయట న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు సోమవారం చేపట్టారు. ఏపీ భూమి హక్కుల యాజమాన్యం 2022 చట్టంతో అన్ని వర్గాల ప్రజలకు నష్టం వాటిల్లుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంకురాత్రి జనార్దన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చింతల వెంకటరెడ్డి, మేకల నాగేంద్ర ప్రసాద్, అత్తలూరి శ్రీనివాసరావు, రామశేత తదితరులు పాల్గొన్నారు.


నిధుల దుర్వినియోగంపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని ఊటుకూరు గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని వీటిపై ఆరా తీసి నిగ్గు తేల్చాలని టిడిపి సీనియర్ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు స్పందనలో ఫిర్యాదు చేశారు. గ్రామ కార్యదర్శిగా కొనసాగిన ఐ.శివ నాగమణి, అప్పటి ఎంపిడిఓ ఎర్రమల పిచ్చిరెడ్డిలపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తహశీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి తెలిపారు. పెనుగొల గ్రామంలో అర్‌ఎస్ నెంబర్ 201లో ఉన్న బాలయ్య కుంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సుగ్గల వెంకట అప్పారావు కోరారు. కనుమూరు నుండి రెండెకరాల 20 సెంట్లు భూమిని నకిలీ ధ్రువపత్రంతో రిజిస్ట్రేషన్ చేయించారని వడ్డెబోయిన వెంకటరమణ ఫిర్యాదు చేసినట్లు బాలకృష్ణారెడ్డి వివరించారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో విజేతలకు బహుమతులను ఆర్డీవో మాధవి ఎంపీపీ గద్దల భారతి, జడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డితో కలిసి సోమవారం అందజేశారు. గ్రామస్థాయిలో గెలుపొందిన వారు, మండల స్థాయిలో నిలిచిన జట్లకు నియోజకవర్గ స్థాయిల్లో తిరువూరు స్టేడియం లో కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖో-ఖో, క్రికెట్ పోటీలు మహిళలకు, పురుషులకు విడివిడిగా జరిగాయి. పురుషుల విభాగం కబడ్డీలో తిరువూరు మండలం కోకిలం పాడు జట్టు ప్రథమ, గంపలగూడెం మండలం పెనుగొలను ద్వితీయ, విస్సన్నపేట మండలం పుట్రేల తృతీయ, మహిళా విభాగంలో ఎ.కొండూరు మండలం రామ చంద్రాపురం ప్రథమ, తిరువూరు మండలం మల్లేల ద్వితీయ, విస్సన్నపేట మండలం పుట్రేల తృతీయ స్థానాల్లో విజయం సాధించారు.

ఎండుతున్న ఆరుతడి పంటలు


కృత్తివెన్ను మండలం మునిపెడలో ఎండిపోతున్న మినుము పంట


బంటుమిల్లి మండలం నరసన్నచెరువులో నీటిని తోడేందుకు రైతుల కష్టాలు

ప్రజాశక్తి-పెడన: ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వమో తెలీదుగానీ ఫలితంగా వేలాది రైతుల జీవితాల్లో ఏడాది చీకటిని కమ్ముకుంటుంది. ఫలితంగా దేశానికి పట్టు కొమ్మలని భావించే గ్రామాల్లోని రైతులు కంటనీరు పెట్టాల్సి వస్తుంది. ఖరీఫ్ సీజన్లో అతివృష్టి, రబీకి అనావృష్టి కారణంగా ఈ ఏడాది రైతుల పాలిట శాపంగా దాపురించింది. దీంతో ఎక్కడ వేసిన గొంగళి ఎక్కడ అక్కడే అన్నచందంగా రైతన్నల పరిస్థితి తయారయింది. నియోజకవర్గ పరిధిలోని పెడన, బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల్లో వేసిన ఆరుతడి పంటలైన మినుము, వేరుశనగ, ఉలవ వంటి పలు పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని బోరున విలపిస్తున్నారు. అధికారుల రికార్డుల ప్రకారం పెడన మండలంలో 17వేల ఎకరాల్లో మినుము, 80 ఎకరాల్లో వేరుశనగ, ఉలవ పంటలను వేశారు. అలాగే బంటుమిల్లి మండలంలో 8 వేల ఎకరాల్లో, కత్తివెన్ను మండలంలో 1500 ఎకరాల మినుము, చిన్న గొల్లపాలెం, నిడమర్రు గ్రామాల్లో వంద హెక్టార్లకు పైగా వేరుశనగ పంట సాగు చేస్తున్నారు. అయితే విత్తు మొలకెత్తిన అప్పటినుంచి 30 నుంచి 35 రోజుల్లోపు ఆయా పంటలకు ఒకసారి సాగునీటితో తడుపు అందించాలి. దీనివలన మొక్కలు దఢంగా చివరి పింద దశ వరకు తయారవుతుంది. అయితే ఇప్పటికే ఆరుతడి పంటలు వేసి నెలరోజులు దాటడంతో రైతన్నలు పంట కాలవల్లోని సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. గత నాలుగు రోజులుగా వీటినుంచి అరకొరగా వస్తున్న నీటిని ఎగుప్రాంతాలైన కొన్ని గ్రామాల్లో నీళ్ల ఇంజన్లు, ట్రాక్టర్లు సహాయంతో వీటిని తోడేస్తున్నారు. ఫలితంగా నీరు దిగు గ్రామాలకు చేరడం లేదని రైతులు చెబుతున్నారు. మరో వారం పది రోజుల్లో ఈ పంటలకు నిరందించకపోతే దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. అసలే గత నెలలో కురిసిన చిమ్మింగ్ తుఫాన్ కారణంగా వ్యవసాయంలో పూర్తి స్థాయిలో దెబ్బతిన్నామని, ఇప్పుడు అనావష్టి తో మరోసారి రైతు కుదేలు అవ్వాల్సిన పరిస్థితి నెలకొందని విలపిస్తున్నారు. ఇప్పటికే మల్లేశ్వరం ఛానల్ కాలువను ఆనుకొని ఉన్న కొన్ని గ్రామాల్లో నీ రైతులు అరకొరగా వస్తున్న నీటిని తోడి పంటలకు అందిస్తున్నారు. ఇంజన్ అద్దె, నీళ్ల పైపుల బాడిగా, డీజిల్ వంటి వాటికి అధిక భారం చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా పైరుకు పురుగు మందులు పిచికారి చేయాలంటే దాదాపు రెండు కిలోమీటర్ల దూరం నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని పలు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దిగువ ప్రాంతాల వరకు సాగునీటిని అందజేయాలని అలాగే ఈ నీరు చేపల, రొయ్యల చెరువులకు తరలించకుండా చర్యలు చేపట్టాలని రైతులకు కోరుతున్నారు.



అంగన్‌వాడీలకు అభినందనలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు అంగన్వాడీలు రాష్ట్ర పోరాటాలతో కొత్త అధ్యయనం సష్టించారని జిల్లా రైతు సంఘం కార్యదర్శి పి రంగారావు అన్నారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు అంగన్వాడీ సెక్టార్‌లో సోమవారం అంగన్వాడీలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పి.రంగారావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ 42 రోజులు వీరోచితంగా పోరడిన అంగన్వాడీలు రాష్ట్ర పోరటలతో కొత్త అధ్యాయం సష్టించారని అన్నారు .సి.పి.ఎమ్.నాయకులు బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఒప్పందం వ్రాత పూర్వకంగా చేసుకొందనీ. అమలు చేయకపోతే జూలైలో మళ్లీ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం మారినా ఒప్పందం విలువ ఏమీ తగ్గదని ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు పి.జయలక్ష్మి, సెక్టార్ నాయకులు కె.అమ్మాజీ, గుడ్లవల్లేరు సబ్ సెంటర్ నాయకులు కె.నక్షత్రం, సెక్టార్ సభ్యులు వి.వాణి, కె.సునీత, ఎస్.భవాని, జి.రాజనీపద్మజ, ఎమ్.మంజుల, వి.మౌనిక గ్రేస్ తదితరులు పాల్గొన్నారు

ఎఫ్‌డిఒ సత్యనారాయణకు సత్కారం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్, కోడూరు ఇంచార్జి ఎఫ్‌డిఒగా మత్స్యకారులకు ఉత్తమ సేవలను అందించినందుకు 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో కష్ణాజిల్లా కలెక్టర్ పి రాజాబాబు చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్న సందర్భంగా పి సత్యనారాయణ ను కష్ణాజిల్లా మెకనైజేడ్ బోట్స్ అసోసియేషన్ అధ్యక్షులు లంకే వెంకటేశ్వరరావు ఆద్వర్యంలో సంఘం కార్యాలయంలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘాల రాష్ట్ర నాయకులు సైకం భాస్కరరావు ,లకనం నాగాంజనేయులు, అంకాని శేషుబాబు ఎఫ్‌డిఒ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీత ఈశ్వరప్రసాద్, లంకే శ్రీనివాస ప్రసాద్, కర్రి కృష్ణమూర్తి, వాటిపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లాకు బదిలీపై నూతనంగా వచ్చిన మత్స్యశాఖ జేడి చేంద్రశేఖకు మత్స్యకార నాయకులు స్వాగతం పలికి దుశ్శాలువాతో సత్కరించారు.





పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-కోడూరు: మండల పరిధిలోని లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొండూరి నాంచారమ్మకు చెందిన ఒంటినిట్టాడి పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతయింది. సోమవారం వేకువ జామున రెండున్నర గంటల సమయంలో ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో నాంచారమ్మ బయటికి పరుగులు తీసింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావించారు. ప్రమాదంలో నివాసగహం పూర్తిగా దగ్ధం కాగా అందులో ఉన్న రూ.60 వేలు నగదు, 20 గ్రాముల బంగారం అగ్నికి ఆహుతి అయినట్లు బాధితురాలు తెలిపింది.

ఉమామహేశ్వరరావుకు అభినందనలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: కవుతరం గ్రామపంచాయతీ బోర్డు లేకపోయినా ప్రత్యేక అధికారి నిర్వహణలో కార్యదర్శి ఉమామహేశ్వరరావు గ్రామాభివద్ధికి కషి చేసినందుకు ప్రభుత్వం గుర్తించి ఉత్తమ కార్యదర్శిగా జిల్లా కలెక్టర్ రాజబాబు చేతుల మీదుగా అవార్డును అందుకున్నందుకు గాను సోమవారం ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి, సిఐటియు నాయకులు మద్దాల జగన్, పద్మావతి పాల్గొన్నారు.

పేర్ని నాని దోపిడీలకు అడ్డుకట్ట వేయండి : కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం ఎమ్మెల్యే ముసుగులో పేర్ని నానీ చేస్తున్న అవినీతి కి అడ్డు కట్ట వేయాలని, అలాగే పేర్ని నానికి సహకరిస్తున్న అధికారులపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని నాని దందాల చిట్టాను ,మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర సోమవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుకు స్పందనలో అందించారు. అనంతరం రవీంద్ర విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి దొంగ పట్టాల పంపిణీ చేస్తున్నారని ఈ అక్రమాలపై అధికారుల పాత్ర పై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గుమ్మటాల చెరువు ఆక్రమణలో అధికారుల లాలూచీని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారురర. కుమ్మరగూడెం సర్వే నంబర్ 179 180, 181కి చెందిన 26 ఎకరాల మడుగు పోరంబోకు భూ ఆక్రమణ పాల్పడుతూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. రవీంద్ర ఫిర్యాదుపై కలెక్టర్ స్పందిస్తూ తక్షణమే కుమ్మరిగూడెం, గిలకలదిండి, గుమ్మటాల చెరువు, మంగినపూడి గ్రామాలను పరిశీలించి చర్యలు



తీసుకోవాలని ఆర్డిఓ ఎం.వాణిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు కుంచే దుర్గాప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇలియాస్ పాషా, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, మాజీ జెడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్, మాజీ హాస్పిటల్ చైర్మన్ తలారి సోమశేఖర్, మాజీ రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ మరకాని పరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

24 మంది జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: బందర్ సబ్ డివిజన్ పరిధిలోని పలు స్టేషన్ల పరిధిలో పేకాటలపై సోమవారం పోలీసులు మెరుపు దాడులు చేశారు. దాడుల్లో పెద్ద


తరకటూరులో జూదరులు, నగదుతో పోలీసులు

సంఖ్యలో పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు. గూడూరు మండలం తరకటూరు గ్రామంలో జరుగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ, 1,01,200 స్వాధీనం చేసుకున్నారు. బందరు ఇన్చార్జి డిఎస్పి యు నాగరాజు పర్యవేక్షణలో రూరల్ సీఐ హబీబ్ భాషా ఆధ్వర్యంలో దాడులు నిర్వహించిన ఎస్సై శేషు కుమార్.అలాగే బందరు మండలం సీతారామపురంలో పదిమంది పేకాట రాయళ్ళను పట్టుకుని రూ, 3210 స్వాధీనం చేసుకున్న ఎస్ఐ పద్మ. ఇనకుదురుపేట స్టేషన్ పరిధిలోని నూరుద్దిన్ పేటలో జరుగుతున్న పేకాటపై దాడి చేసి ఏడుగురు పందెం రాయుళ్లను పట్టుకుని రూ.26,500 సిఐ విద్యాసాగర్ స్వాధీనం చేసుకున్నారు.



ఆరో రోజుకు సెర్ప్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు కలక్టరేట్ ధర్నా చౌక్ లో జిల్లా సెర్ప్ ఉద్యోగులు చేస్తున్న నిరవదిక సమ్మె సోమవారానికి ఆరో రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ లైన పే స్కేల్ మరియు రెగ్యులరైజేషన్ పై గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం దష్టికి తీసుకు వస్తున్నప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత 23 సంవత్సరాలుగా పనిచేస్తు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయుచున్న నవరత్నాలులో భాగంగా వై ఎస్ ఆర్ ఆసరా. వై ఎస్ ఆర్ చేయూత, నాడు నేడు, సున్నా వడ్డీ, జగనన్న తోడు, జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణము, పేదలకు సుస్థిర జీవనోపాదులు పెంపుదల వంటి సంక్షేమ పథకాలు అమలులో తామంతా ముఖ్య పాత్రను పోషిస్తున్నామని కాబట్టి తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో జిల్లా జేఏసీ నాయకులు సి హెచ్, తిరుపతయ్య, వై. రాజా గోవింద్, డి. శ్రీనివాస్, యం. నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

భ్రూణ హత్యల నివారణకు చర్యలు

డిఎంహెచ్ఒ డాక్టర్ గీతాబాయి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో భ్రూణ హత్యలు నివారించాలని, గర్భస్థ శిశువులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జీ.గీతాబాయి అనాన్నారు. జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశాన్ని సోమవారం డిఎంహెచ్ఒ అధ్యక్షతన ఆమె కార్యాలయంలో నిర్వహించారు. అల్ట్రా సోనోగ్రఫీ కేంద్రాలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలల స్థాపన కోసం దరఖాస్తు చేసుకున్న సంస్థల ఆమోదానికి జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గీతాబాయి మాట్లాడుతూ ఏదైనా అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే లింగ నిర్ధారణ పరీక్షలు చేయాలని భావిస్తే , అది కూడా గైనకాలజిస్టు ఆధ్వర్యంలోనే నిర్వహించాలని, స్కానింగ్‌కు ఎంత మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నారో ఆ వివరాలు బోర్డుపై బహిరంగంగా ప్రదర్శించాలన్నారు. అలా కాకుండా చట్టవ్యతిరేకంగా చేపడితే బాధ్యులైన వాళ్లు చట్టపరంగా శిక్షలకు గురవుతారన్నారు. లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమని, జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ల్యాబ్‌లు విధిగా


మాట్లాడుతున్న గీతాభాయి

రిజిస్ట్రేషన్ చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని, వాటి వివరాలు వెబ్‌పోర్టల్‌లో నమోదు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ అనురాధ, ఎం.హారిక, రేడియాలజిస్ట్ ఐ.వినీల్, మానిటరింగ్ కన్సల్టెంట్ పరసా మస్తానమ్మ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ బాబుకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఫ్యూచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు చేసిన వారికి ది లీడర్ అవార్డ్‌ల ప్రదానోత్సవంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న తూములూరి ప్రసాద్‌బాబుకు సామాజిక రంగంలో ది లీడర్ అవార్డ్‌ను కళాశాల డైరెక్టర్ అమరనేని కార్తిక్, ఫౌండేషన్ అధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు చేతుల మీదుగా అవార్డ్ ప్రదానం చేశారు.

5న పదోతరగతి మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పదోతరగతి మోడల్ పరీక్ష సంబంధించిన వాల్ పోస్టర్లను పట్టణంలోని జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌లో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయిక్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం 'ప్రజ్ఞా వికాసం' పేరుతో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష ఫిబ్రవరి 5న ఉంటుందని, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.25 ఉంటుందని, మధ్యాహ్నం 2 గంటల నుండి 3.30 నిమిషాల వరకు పరీక్షా సమయం ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 8790865130 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ పాఠశాల హెచ్.ఎం యుటిఎఫ్ నాయకులు వి.కష్ణయ్య, సిహెచ్.హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి న్యూ క్రేట మోడల్ కారు

జగ్గయ్యపేట: పట్టణ సమీపంలోని కుశలవ హుండాయ్ కార్ల షోరూం నందు న్యూ క్రేట మోడల్ కార్‌ను సోమవారం జగ్గయ్యపేట సిఐ జానకిరామ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వివిధ నూతన ఫ్యూచర్‌తో ఆకర్షణీయంగా కనిపిస్తు కస్టమర్స్ అభిమానం పొందుతున్నట్లు తెలిపారు. బ్యాంక్, ఇన్సూరెన్స్ ప్రతినిధులు, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు బంగారు గాజులు విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవాలయినికి తాడేపల్లిగూడెంకు చెందిన నాగ రాకేష్ మరియు కుటుంబసభ్యులు శ్రీ అమ్మవారి అలంకారం నిమిత్తం 19.5 గ్రాములు బరువు గల బంగారు గాజులు (2) ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబుని సోమవారం కలిసి దేవస్థానానికి విరాళంగా అందజేశారు.

వ్యవసాయ భూములను రీసర్వే చేయాలి

ప్రజాశక్తి - వత్సవాయి : పోచవరం గ్రామపంచాయతీ పరిధిలో రెవెన్యూను వ్యవసాయ భూములు రిసర్వే చేసి న్యాయం జరపాలని పోచవరం గ్రామ సర్పంచి లేళ్ల హరికృష్ణ రెడ్డి అధికారులపై ఆరోపించారు. ఈ సర్వేలో హక్కుదారులైన రైతులకు తెలియజేయకుండా హద్దులు, వివాదాలు పరిష్కరించకుండా వ్యవసాయ భూములలో నిర్ణయించారని ఆగ్రహం చేశారు. ప్రభుత్వ భూములు, రోడ్లు, ముందుగా గుర్తించి తమకు ఎఫ్ఎంబి ప్రకారం రీ సర్వేలో నంబర్‌లో గల సబ్ డివిజన్ ప్రకారం విడగొట్టి తమ వద్ద గల భూ రికార్డుల ప్రకారం కేటాయించాలని కోరారు. ఈ డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహశీల్దార్ మాడుగుల రవికి అందజేశారు. లేళ్ల నాగేందర్ రెడ్డి, కె.రామిరెడ్డి, టి.శ్రీధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాధవరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఐఐటి కాన్పూర్‌తో శాంసంగ్ ఒప్పందం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులను కలిగి ఉన్న కీలక వృద్ధి రంగాలపై దృష్టి పెట్టేందుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాన్పూర్ సంస్థతో శాంసంగ్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి కె.శంకర్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమకు సిద్ధంగా ఉండేందుకు కావాల్సిన నైపుణ్యాన్ని శాంసంగ్ అందిస్తుందన్నారు. ఈపరిశోధనా ప్రాజెక్టులలో ఆరోగ్యం, విజువల్, ఫ్రేమ్‌వర్క్, బిజినెస్ 2 బిజినెస్ భద్రత, జనరేటివ్, క్లౌడ్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల వంటి వాటిపై వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిశోధనా కార్యక్రమాలతో పాటు ఏఐ, క్లౌడ్, అనేక ఇతర అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో సహా కీలకమైన టెక్నాలజీ డొమైన్‌లలో శామ్‌సంగ్ ఇంజనీర్ల నైపుణ్యతను పెంపొందించడానికి ఈ కార్యక్రమం సహాయపడుతుందని తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎంపి ప్రారంభోత్సవం



డివైడింగ్ లైట్లను ప్రారంభిస్తున్న ఎంపి నాని, ఉదయభాను

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభానుతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని నాని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వాటర్ ట్యాంకర్స్ పంపిణీ, ఆర్టీసీ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం, కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన జగ్గయ్యపేట – చిల్లకల్లు సెంట్రల్ డివైడింగ్ లైట్స్ ప్రారంభం చేశారు. పట్టణ సమీపంలోని బి కన్వెన్షన్ హాల్‌లో వైసిపి నాయకులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అభివద్ధి చేసినట్లు తెలిపారు. జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పిటల్ అని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ సుందరీకరణలో భాగంగా పట్టణంలోని స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ ప్రధాన గేట్ వద్ద 13లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన వాటర్ ఫౌంటెన్ ఎర్పాటు చేయటం జరిగిందన్నారు. జగ్గయ్యపేట లో 150 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు, నేషనల్ హైవే పక్కన నేషనల్ హైవే బస్టాండ్ ఏర్పాటు, జగ్గయ్యపేట నుండి చిల్లకల్లు వరకు నాలుగు రోడ్ల నిర్మాణం 14 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ వారికి అండగా ఉంటుంటే చంద్రబాబు మాత్రం తన కొడుకును సీఎం చేసేందుకు కష్టపడుతున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెత్తందారుల కోసమే పనిచేస్తాడని విమర్శించారు. ఉదయభాను ఎంతో సమర్థత కలిగిన నాయకులని కొనియాడారు. అనంతరం జగ్గయ్యపేట పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మోటర్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, సామినేని విమలాబాను, నాయకులు తన్నీరు నాగేశ్వరరావు, మానేపల్లి బ్రహ్మం, తుమ్మల ప్రభాకర్, వేల్పుల రవికుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సందర్శకుల రద్దీ దృష్ట్యా దుర్గగుడిలో మెరుగైన సేవలు



మాట్లాడుతున్న దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇఓ కెఎస్ రామారావు, పాలకమండలి సభ్యులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గమ్మ దర్శనానికి పెరుగుతున్న యాత్రికుల రద్దీ దష్ట్యా భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు తెలిపారు. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం వారి జమ్మిదొడ్డి మీటింగ్ హాలులో సోమవారం దుర్గగుడి పాలకమండలి సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్.రామరావు పాల్గొన్నారు. చైర్మన్ కర్నాటి రాంబాబు మాట్లాడుతూ రానున్న ఫిబ్రవరి 7వ తేదీకి ప్రస్తుత పాలకమండలి ఏర్పాటై ఏడాది పూర్తవుతుందన్నారు. దేవస్థానంలో జరగబోవు అభివృద్ధి పనులు, పెరుగుతున్న యాత్రికుల రద్దీ దృష్ట్యా యాత్రికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు గానూ, ప్రతిరోజూ ఉ.11.30 గంటల నుండి మ.12.15 గంటల వరకు అమ్మవారి నైవేద్యం నిమిత్తం దర్శనం నిలుపుదల చేయడం అందరికీ తెలిసిన విషయమే అన్నారు. వివిఐపి, విఐపిలు, వద్దులు మరియు వికలాంగులు మధ్యాహ్నం 2.00 గంటల అనంతరం అమ్మవారి దర్శనానికి రావాలని కోరారు. ఆలయ ఇఒ రామారావు మాట్లాడుతూ కొండపైన మైకు ప్రచార కేంద్రం వద్ద ఒక దర్శనం కౌంటరు, ఘాట్‌రోడ్ టోల్‌గేట్ వద్ద వాహన పూజలు, ప్రసాదం కౌంటరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 1995-96 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఇబ్రహీంపట్నంలోని ఏ కాలనీ ఎస్‌విడివి.కళ్యాణ మండపంలో గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా కొండపల్లి బాలుర ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీగా బయలుదేరి విద్యార్థులు ఉత్సాహంగా బైకులు కార్లతో ఇబ్రహీంపట్నం రింగ్ మీదుగా ఏ కాలనీ కళ్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన 27 మంది ఉపాధ్యాయులను ఘనంగా పాదాభిషేకాలు చేసి సత్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆధరాభిమానాలతో తమను కట్టిపడేశారంటూ కితాబు ఇచ్చారు. ఉపాధ్యా యులతో వారి బయోడేటాలతో చేసిన ఏవీలు, తమను వీడిన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల, ప్రస్తుతం ఉన్న విద్యార్థుల కుటుంబ సభ్యులతో కూడిన ఎవిల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఏర్పాటుచేసిన సప్పా శివ కుమార్ శిష్యురాలు బేబీ శ్రావ్య కూచిపూడి నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.



హాజరైన పూర్వ విద్యార్థులు

మై ప్యాడ్ మై రైట్ ప్రాజెక్టు ప్రారంభం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: రుతుస్రావం సమయంలో మహిళల పరిశుభ్రతపై అవగాహన కోసం ' మై ప్యాడ్ మై రైట్ ' ప్రాజెక్టు ద్వారా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుననట్లు దాల్మియా సిమెంట్ యూనిట్ హెడ్ ముకేష్ కుమార్ సిన్హ తెలిపారు. ఆటోనగర్‌లోని దాల్మియా భారత్ ఫౌండేషన్ కార్యాలయంలో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఆయన తెలియచేశారు. గ్రామీణ ప్రాంతాలలోని మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రుతుక్రమ సమస్యల పరిష్కారానికి దాల్మియా భారత్ ఫౌండేషన్ , నాబార్డు, సహకారంతో మై ప్యాడ్ మై రైట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా మహిళలకు బుతుస్రావ సమయంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా శానిటరీ న్యాప్‌కిన్‌లను రూపొందించి అందిస్తున్నామని తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎం కిండర్ గార్డెన్ స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: నగరంలోని యన్.ఎస్.ఎం. పబ్లిక్ స్కూల్ కిండర్ గార్డెన్ స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం పటమటలోని పాఠశాల ఆవరణలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ జి.శరత్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదివిన నాటి నుండి నేటి వరకు పాఠశాల సఽఆథయి అంతకంతకూ పెరుగుతూ వచ్చిందన్నారు. దీనికి గల కారణం చక్కని ప్రణాళిక, కార్యాచరణ తూచా తప్పకుండా అనసరించడమేనన్నారు. ఇక్కడ విద్యార్థులు చదువును మాత్రమే కాకుండా వివిధ అంశాలపై, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై మంచి పట్టు సాధిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ మోంట్‌ఫోర్ట్, ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్ప రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి పాల్గొన్నారు.



కొత్తపేట సిఐను కలిసిన దేవస్థానం పాలకవర్గం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కొత్తపేట పోలీసు స్టేషన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన తిప్పా గణేష్‌ని సోమవారం ఉదయం కొత్తపేటలోని శ్రీ సత్యభామ రుక్మిణి సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పాలకవర్గం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. సిఐకి శాలువా కప్పి తమ అభినందనలు తెలిపారు. విధినిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని వారు సిఐకి శుభాకాంక్షలు తెలిపారు. సిఐని కలిసిన వారిలో వేణుగోపాల స్వామి ఆలయ పాలకవర్గం అధ్యక్షులు వంజరపు సూర్యారావు, పాలకవర్గం సభ్యులు నమ్మి భాను ప్రకాష్, వెంకట రమణ వున్నారు. ఇదిలావుండగా ఫిబ్రవరి 1వ తేదీన శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న 8 షాపులను బహిరంగ వేలం వేయనున్నామని, అందుకోసం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సిఐకి వారు వినతిపత్రం అందజేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: సేతురాముల విద్యా మందిర్ కరాటే విద్యార్థులు జాతీయస్థాయిలో తమ ప్రతిభ చూపారని శ్రీమతి సేతు రాముల్ విద్యామందిర్ పాఠశాల ప్రిన్సిపాల్ శానం ఏలేశ్వరరావు తెలిపారు. సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడి శివాజీ, రఘురాం ఆధ్వర్యంలో పాఠశాల పిఇటి మాస్టర్ అనిల్ కుమార్ కరాటే మాస్టర్ ఫటన్ నాయక్ ఆధ్వర్యంలో పిల్లలకు మెడల్స్, ప్రతిభాపత్రాలను అందజేశారు.

హెడ్ వాటర్ వర్క్స్ పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం వాటర్ హెడ్ వర్క్స్ వద్ద బూడిద కలిసే ప్రాంతాన్ని టిడిపి కౌన్సిలర్లు పార్టీ నేతలతో మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరావు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేశినేని నాని, జోగి రమేష్ వసంత కష్ణ ప్రసాద్‌పై విరుచుకుపడ్డారు. యథేచ్ఛగా బూడిద రవాణాతో కోట్లు దోచేస్తున్న వైసిపి దొంగలు, పందికొక్కులు అన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండల గ్రామాల్లో పరిశుభ్రమైన నీరు వచ్చేవరకు ఆందోళన చేస్తామన్నారు. బూడిద దోపిడీ ఆగే వరకు ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు విద్యుత్ లైట్లు అందజేత

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం: కొండపల్లిలో కబడ్డీ ఆడుతున్న ప్రాంతం వద్ద విద్యుత్ లైట్లను సోమవారం వైసిపి కొండపల్లి మున్సిపాల్టీ యువజన అధ్యక్షుడు సుభాష్ అందజేశారు. కబడ్డీ ఆడుతున్న కోర్టు వద్ద విద్యుత్ లైట్లు లేకపోవడంతో ఆయనను కోరగా వెంటనే స్పందించారు. క్రీడాకారులకు ఏ అవసరం వచ్చినా సహాయం చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

పట్కారీలకు సత్రం ఏర్పాటు

జగ్గయ్యపేట: శ్రీశైల పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు వచ్చే సోమవంశ సహస్ర అర్జున క్షత్రియ (ఖత్రి)లు అక్కడ బసచేసేందుకు సత్రం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకుగాను ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కషితో శ్రీశైలం దేవస్థానంలో 50 సెంట్ల స్థలాన్ని మంజూరు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు తెలిపారు. ఈ మేరకు స్థల మంజూరు పత్రాలను ఉదయభాను చేతుల మీదుగా సోమవారం అందజేశారు. అనంతరం రాఘవేంద్రరావు మాట్లాడుతూ పట్కారీలు శ్రీశైల మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోవడానికి వెళ్ళినప్పుడు ఉండేందుకు సత్రం వంటి వసతి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయాన్ని ఉదయభాను దృష్టికి తీసుకురావడంతో స్థలాన్ని మంజూరు చేయించారన్నారు.

పోటీ పరీక్షల అభ్యర్థులు ప్రణాళికబద్ధంగా చదవాలి

• ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు ప్రణాళికబద్ధంగా చదవాలని ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు సూచించారు. యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రూప్స్, డివైఇఓ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సోమవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎంఎల్‌సి కె ఎస్ లక్ష్మణరావు ఉచిత అవగాహనా సదస్సు నిర్వహిం చారు. ఈ సం దర్భంగా లక్ష్మణరావు అభ్యర్థులకు పలు అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సిలబస్‌పై పట్టు సాధించడం,పాత ప్రశ్న పత్రాలు చదవడం ,తెలుగు అకాడమీ పుస్తకాలు చదివి, సొంత నోట్స్ తయారు చేసుకుంటే ఈ పరీక్షల్లో విజేతలు కావడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రభుత్వం 897 పోస్టుల భర్తీ కే నోటిఫికేషన్ ఇచ్చారని ఈ సంఖ్యను పెంచాలని, అలాగే ఈ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రభుత్వ స్టడీ సర్కిల్స్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వాలన్నారు అన్నింటిలో ఈ పరీక్షకు అనుగుణంగా పుస్తకాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అనంతరం పోటీ పరీక్షలు కొరకు రూపొందించిన ఉచిత స్టడీ మెటీరియల్ సదస్సులో ఆవిష్కరించి అభ్యర్థులకు ఉచితంగా అందించారు .ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ



ఉచిత స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు, తదితరులు

ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె లెనిన్ బాబు , ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం, జిల్లా ఉపాధ్య క్షులు కీర్తి, మచిలీపట్నం కార్యదర్శి సిహెచ్ రాజేష్ ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న దృశ్యం

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-కోదూరు : కోదూరు మండల పరిధిలోని లింగారెడ్డి పాలెం గ్రామంలో సోమవారం తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొండూరి నాంచారమ్మ ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. స్థానిక జనసేన నేతలు అవనిగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మాదివాడ వెంకటకృష్ణ విషయం తెలియజేయగా వెంటనే స్పందించిన ఆయన బాధిత కుటుంబానికి అండగా నిలబడ్డారు. పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మాదివాడ వెంకటకృష్ణ నాంచారమ్మకు అందజేయడంతో పాటు, రూ.3000 విలువచేసే నిత్య వసర వస్తువులను అందజేశారు. స్థానిక జనసేన పార్టీ నేతలు మరొక 2,500 రూపాయలతో ఆమెకు నిత్యావసర వస్తువులు అందించారు. లింగారెడ్డిపాలెం, పిట్టలంక గ్రామ సర్పం చులు యర్రంశెట్టి శ్రీ దుర్గ, కనగాల వెంకటేశ్వరరావు, కోడూరు, అవనిగడ్డ, మోపిదేవి మండలాల జనసేన అధ్యక్షులు మర్రే గంగయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-గన్నవరం : క్రీడలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఎంపిపి అనగాని రవి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా రవి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహి స్తుందని చెప్పారు. ఆటల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గ ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలలో విజయం సాధించిన గన్నవరం మండల జట్టును గన్నవరం యం. పి. పి అనగాని రవి ప్రత్యేక అధికారి యం డి హాజీ బేగ్ లు అభినందించారు. మాజీ మండలపరిషత్ ఉపాధ్యక్షులు గొంది పరంధామయ్య, యం.పి డి. ఓ సత్యకుమార్, గన్నవరం నియోజకవర్గం క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజుపాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి : ఉప్పాల రాము

ప్రజాశక్తి-పెడన : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని శివారు ప్రాంతాల వరకు పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామని నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని కృత్తివెన్ను మండలంలో ఆయన పర్యటిం చారు. మండల పరిధిలోని ఇంతేరు,చిన్న పాండ్రక, ఎండపల్లి, నీలి పూడి, కొమ్మలపూడి, సీతనపల్లి, మాట్లం, గర్సిపూడి, నిడమర్రు,వరల గొందితిప్ప, లక్ష్మీపురం, పల్లిపాలెం, పడతడిక, గోవింద రాజులు దిబ్బలతోపాటు పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సముద్ర తీర ప్రాంతాలైన ఆయా గ్రామాలకు ఎన్నికల రాకముందే మంచినీటి సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. ఆయా గ్రామాల్లో మంచినీటి అవసరమయ్యే పైప్ లైన్లు, వాటర్ బెడ్లు, సంపులు, మోటార్లు ఫిల్టర్ బెడ్లు గురించి అధికారులతో రెండుమూడు రోజులు చర్చిస్తామని, వాటికి అంచనాలు రూపొందించాలని ఆదేశిస్తా మన్నారు. పది రోజుల్లో మంచినీటి సమస్యకు అవసరమైన నిధులను విడుదల చేస్తామని వాటిని



పల్లిపాలెంలో మాట్లాడుతున్న ఉప్పాల రాము

పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయాల్సిన బాధ్యత ఎంపిటిసి, సర్పంచులపై ఉందన్నారు. మండల పార్టీ అధ్యక్షులు మైదాని వెంకటరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాలకు జడ్పిటిసి సభ్యులు మైలా రత్నకుమారి, ఎంపిపి కోనసాని గరుడ ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కొల్లాటి గంగాధర్, ఎంపిటిసిలు సాధనాలు బాబ్జి, పెనుమాల సునీల్, సర్పంచులు కొల్లాటి మహాలక్ష్మి, కొల్లాటి రాజు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్



కలెక్టర్‌కు అర్జీ అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రజల నుండి అందే స్పందన అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశిం చారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్వో పెద్దిరోజా, జడ్పీ సీఈవో వి జ్యోతిబసు, ముడా విసి రాజ్యలక్ష్మిలతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ ప్రజల విజ్ఞప్తులను ఎంతో ఓపిగ్గా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచిం చారు.

రైతులకు పంటల నష్ట పరిహారం చెల్లించాలి : రైతు సంఘం

జిల్లాలో మిచౌంగ్ తుఫాను పంట నష్ట పరిహారం, బీమా ఇప్పించాలని, 2020 ఏప్రిల్ నెలలో కురిసిన భారీ వర్షాలకు వడగండ్ల వానకు నష్టపరిహారం ఇప్పించాలని, గత సంవత్సరం 2023-24 లో సార్వా పంటకు సంబంధించి రవాణా చార్జీలు రైతులకు ఇప్పించాలని, జిల్లా పరిధిలో మురుగు కాలువల్లో పూడిక, ఆక్రమణలు తొలగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు సంఘ నాయకులు, ఎస్.జనార్దన్‌రావు, తుమ్మల కుటుంబరావు, అబ్బూరి కిరణ్ కుమార్, వినయ్, రమేష్, శివయ్య ,ఆవుల బసవయ్య లు జిల్లా కలక్టర్ పి.రాజా బాబుకు స్పందనలో అర్జీ అందజేశారు. డిఆర్‌డిఏ డ్వామా పీడీలు పి ఎస్ ఆర్ ప్రసాద్, సూర్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి.గీతాబాయి, డి.ఎస్.ఓ పార్వతి, ,డిపిఓ నాగేశ్వర నాయక్, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య, ఐసిడిఎస్ పి డి సువర్ణ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్ బాబు

జగన్ ఏ నిర్ణయం తీసుకున్నా పాటిస్తా

• అవనిగడ్డ ఎంఎల్ఎ సింహాద్రి రమేష్‌బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ముఖ్యమంత్రి జగన్ గీసిన గీతను తాము దాటబోమని, ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా పాటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రామోజీరావు దుర్మార్గపు చెత్త వార్తలు రాయడం మానుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిష్టానానికి తాను ధిక్కారస్వరం వినిపించినట్లుగా ఈనాడు దినపత్రికలో తప్పుడు కథనం ప్రచురించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి తనను ఎంపీగా పోటీ చేయమంటే పోటీకి సిద్ధమని, ఎమ్మెల్యేగా పోటీ చేయమంటే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని రమేష్ బాబు ప్రకటించారు. ఒకవేళ ముఖ్యమంత్రి మరొక అభ్యర్థిని అవనిగడ్డ నియోజకవర్గం కేటాయిస్తే సీఎం వెంట పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని రమేష్ బాబు తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లా రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవల నరసింహారావు, ఎంపిపి తుంగల సుమతీదేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, పాత ఎడ్ల లంక మాజీ సర్పంచ్ సైకం బాబూరావు తదితరులు పాల్గొన్నారు

మూడు చక్రాల బండి వితరణ



ప్రజాశక్తి మచిలీ పట్నంరూరల్ : మచిలీ పట్నం మండలం నవీన్ మిట్టల్ కాలనీకి చెందిన నాగరాజుకు జీవనోపాధి కోసం మన్నెం అనిల్, చలమలశెట్టి బాలాజీ సోమవారం ఉపాధి కల్పిం చారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు మాట్ల డుతూ చక్కెర వ్యాధి కారణంగా నాగరాజు కాలును కోల్పోవడం జరిగిందన్నారు. చేతి సహాయంతో నడిచే మూడు చక్రాల బండి సహాయంగా వీధిలో తిరుగుతూ ఫెనాయిల్ అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకునే నాగరాజుకు భార్య ఇద్దరు ఆడపిల్లలతో వున్నారని, ఒక కాలు కోల్పోయిన కారణంగా 40 వేల రూపాయలు విలువైన బ్యాటరీతో నడిచే 3 చక్రాల బండిని అందించారని తెలిపారు. .ఈ కార్యక్రమంలో విన్నకోట శ్రీకాంత్, త్రిపురారి తరుణ్, చలమలశెట్టి శ్రీనివాస్, పినిశెట్టివేణు, శాయనశివ, వడ్డీ చిరంజీవి, మోకావి, తిరుమల శెట్టిరాజు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో సూపర్వైజర్ గా పనిచేస్తూ పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న పి.వి. రవికుమార్ కు సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ ను ఏఎంసి చైర్ పర్సన్ తోట కరుణ, తోట వెంకయ్య దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తోట కరుణ మాట్లాడుతూ... అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా రైతులకు సేవలందించడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ఈ శాఖలో చిన్న స్థాయి ఉద్యోగిగా చేరి అంచెలంచెలుగా ఎదిగిన రవికుమార్ అభినందనీయులని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, ఏఎంసి డైరెక్టర్ మొటుమర్రి శేఖర్, గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య, వైఎస్సార్ సిపి ఎస్సీ సెల్ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, ఏఎంసి గ్రేడ్ -1 కార్యదర్శి ఏ .కిషోర్, గ్రేడ్ -3 కార్యదర్శి పి. జ్యోతి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ డైరీ ఆవిష్కరణ



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : నూతన సంవత్సర ఎస్ఎఫ్ఐ డైరీని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సోమ వారం ఆవిష్కరించారు. విద్యార్థి సమస్యల మీద నిరంతరం పోరాడుతూ వారి సమస్యలను పరిష్కరించడంలో ఎస్ఎఫ్ఐ ముందుందని కలెక్టర్ అన్నారు. అదేవిధంగా విద్యారంగ ఉన్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న వసతి దీవెన విద్యా దీవెన అమ్మఒడి విడుదల చేయాలని, భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కృష్ణా జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు దృష్టికి తీసుకు వెళ్లారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ చేస్తున్న కార్యక్రమాలను వారు చేస్తున్న సేవలను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం, జిల్లా ఉపాధ్యక్షులు కీర్తి, మచిలీపట్నం కార్యదర్శి సిహెచ్ రాజేష్ ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనురాధకు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక ఏకెటిపి మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల వ్యాయామోపా ధ్యాయులు కె.అనురాధకు సేవారత్న పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్ నందిహిల్స్‌లోని రోహిత్ ఫంక్షన్ హాల్‌లో మెగా లెజెండ్స్ సోషల్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో సామాజిక సేవ దక్పథం ఉన్న వివిధ రంగాలలోని వారికి అందించే సేవా రత్న పురస్కారాన్ని కార్పోరేట్ ఎం.ఎల్చిరెడ్డి, జనహిత హ్యూమన్ రైట్స్ అధినేత చల్లా గీతారెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు. అవార్డునందుకున్న అనురాధను గుడివాడ డిఫైవో పద్మారాణి, కృష్ణా జిల్లా ఖో-ఖో సంఘ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుడివాడ చైర్మెన్ చలసాని స్పందన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం ఉమామహేశ్వరరావు, ఎన్‌సిసి చీఫ్ ఆఫీసర్ మడక ప్రసాద్ తదితరులు అభినందించారు.

పాత అంశాలే మళ్లీ అజెండాలోకి

(మొదటి పేజీ తరువాయి)
మొత్తం ఎనిమిది మందితో మేయర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి నిర్ణయించాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. అప్పుడు తీసుకున్న నిర్ణయంపై ఎటువంటి చర్చా లేకుండా ప్రస్తుతం అదే అంశాన్ని అజెండాలోకి తీసుకురావడాన్ని విపక్షాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. అలాగే ఏళ్ల తరబడి పంపిణీకి నోచుకోని టిడ్కో గృహాలు, వీటికి డబ్బులు చెల్లించిన వందలాది మంది బాధిత లబ్ధిదారులకు సుమారు రూ.9 కోట్ల వరకు తిరిగి విఎంసి చెల్లించకపోవడం, దోమలు, మంచినీటి ఎద్దడి, సిబ్బంది కొరత, ప్రశ్నార్థకంగా మారిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీమ్, నేటికీ మంజూరు కాని రూ.140 కోట్ల ఎపి గ్రాంట్స్ తదితర అంశాలపై అధికార వైసిపిని నిలదీయాలని విపక్షాలు సిద్ధమయ్యాయి.

దళిత, గిరిజన రైతుల ధాన్యం బకాయిలు చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)
కోరారు. 2021లో బాధిత రైతుల నుండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. బకాయిల కోసం మండల, డివిజన్ స్థాయి అధికారులకు, పౌరసరఫరాల శాఖ ఎమ్‌డికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోటా కళ్యాణ్ మాట్లాడుతూ బకాయిలు మంజూరు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతు వేంపాటి అపరాణి, పలువురు రైతులతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆనందరావు, సయ్యద్ ఖాసీం పాల్గొన్నారు.

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు, విజయవాడ
E.P. NO. 19/2023 IN OS NO. 167/2011
Between :
1) కలారి వరప్రసాదరావు (డైడ్)
2) కలారి విజయలక్ష్మి
3) కలారి సతీష్‌కుమార్
4) కలారి సునీత .... డిహెచ్ఆర్స్
అండ్
వల్లభనేని అశ్విని కుమార్ .... జెడిఆర్ నెం.1
టు
వల్లభనేని అశ్వినికుమార్, తండ్రి : వి.ఎస్.అప్పారావు, డోర్ నెం. 39-1-89, కళ్యాణి కాంప్లెక్స్, లబ్బీపేట, విజయవాడ, కృష్ణాజిల్లా.
పై నెంబరు పిటీషన్‌లో మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది. 21-02-2024 తేదీనకు వాయిదా వేసి ఉన్నారు. కనుక సదరు తేదీ ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరఫున న్యాయవాది ద్వారా గానీ పైన తెలిపిన కోర్టువారి యెదుట హాజరై మీ అభ్యంతరములు ఏమైనా వున్న యెడల చెప్పుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షంలో పై నెంబరు అమలు దరఖాస్తును శ్రీ కోర్టు వారు తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
ఇట్లు
జి.ఎస్.రామమ్,
కె.శ్రీనివాసరావు,
న్యాయవాదులు,
డోర్ నెం. 26-23-32, సుందరమ్మ స్ట్రీట్,
గాంధీనగర్, విజయవాడ.
ఫోన్ : 9392972768

ప్రకటన
మహారాజశ్రీ మంగళగిరి సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
I.A. 544/2021 OS 243/2015
పుప్పాల రమేష్ అండ్ మరియొకరు ... పిటీషనర్స్
అండ్
లేటు పుప్పాల నాగేశ్వరరావు వగైరాలు... రెస్పాండెంట్స్
3) పుప్పాల సురేష్‌బాబు, తండ్రి నాగేశ్వరరావు
4) పుప్పాల గిరిజ, భర్త : సురేష్‌బాబు
5) పుప్పాల చైతన్య, తండ్రి : సురేష్‌బాబు
6) పుప్పాల అనూష, తండ్రి : సురేష్‌బాబు
వీరి నివాసం : డోర్ నెం. 32-4-15, కోస్టల్ అపార్ట్‌మెంట్స్, ప్రజాశక్తి నగర్, మొగల్‌రాజపురం, విజయవాడ.
పై నెంబరు పిటీషను ఈ రెస్పాండెంట్సు హాజరు నిమిత్తం ది.15-2-2024కు వాయిదా అయివున్నది. కావున వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలున్నచో తెలుపుకొన వలెను. లేనిచో పరోక్షంలో తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
ఇట్లు
మందపాటి బసవారెడ్డి,
అడ్వకేటు, విజయవాడ-2.

స్పందనలో 19 ఫిర్యాదులు

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కౌంటర్ రూమ్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ పాల్గొని ఆర్జీలను స్వీకరించారు. ప్రజల నుండి ఇంజినీరింగ్ విభాగానికి వచ్చిన 10 అర్జీలను, అలాగే టౌన్ ప్లానింగ్ 6,హార్టికల్చర్ 1ఎస్టేట్ 1, పి ఓ యు సి డి ఒక అర్జీని మొత్తం కలిపి 19 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) కె. శకుంతల, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పి రత్నావళి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి వెంకటలక్ష్మి, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్, పి ఓ యు సి డి రోహిణి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, అకౌంట్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఆర్ ఎఫ్ ఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రివర్ ఫ్రంట్ పార్క్‌ను త్వరగా పూర్తి చేయండి : దినకర్

ప్రజాశక్తి - విజయవాడ : కష్ణానది ఫేస్- 2 రిటైనింగ్ వాల్ వెంబడి సుందరంగా, ఆహ్లాదకరమైన పార్కు ఏర్పాటుకు కనకదుర్గ వారధి నుంచి రామలింగేశ్వర డీపీ స్టేషన్ వరకు 1.25 కి.మీ పొడవున సుమారు రూ.7.8 కోట్ల నగరపాలక సంస్థ వ్యయంతో, రూ.4.5 కోట్ల అర్బన్ గ్రీనరీ వారి వ్యయంతో నిర్మిస్తున్న రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకు రావాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం ఆయన ఈ పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నోటీసు
ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP No: 12/2022
in
OS No: 321/2008
బిట్వీన్
శీలంశెట్టి లింగయ్య (డైడ్) మరొకరు ..D.H.Rs
వర్సెస్
శీలంశెట్టి వెంకటరావు (డైడ్) మరియు నలుగురు ....JDRs
To
1శీలంశెట్టి ఉదయలక్ష్మి
భర్త లేటు వెంకటరావు
2.శీలంశెట్టి గోపికృష్ణ, తండ్రి లేటు వెంకటరావు
3.ముత్యాల బాల త్రివేణి, భర్త వెంకట రవి
4.శీలంశెట్టి అనిల్ కుమార్,
తండ్రి లేటు వెంకటరావు,
ప్లాట్ నెంబర్ OFF2, 8వ లైన్ ,తోటవారివీధి
Door No: 43-121-13, అజిత్ సింగ్ నగర్,
విజయవాడ-AP
పై నెంబరు EP మీకు నోటీసు నిమిత్తము వాయిదా తేది 09-02-2024 కి ఉన్నది కనుక మీరు ఆరోజు ఉదయం 10:30 కి స్వయంగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని హాజరై సంజాయిషీ తెలియజేయవలసింది లేని యెడల పై నెంబరు మీ పరోక్షమున తీర్మానింపబడునని మీకు ఇందుమూలంగా తెలియడమైనది
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
అడుసుమల్లి రామయ్య
అడ్వకేట్,ఒంగోలు
సెల్ : **9440390288**

విఎంసి కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ : 30 డివిజన్‌లో జరుగుతున్న యాంటీ మలేరియా ఆక్టివిటీస్, పారిశుధ్య నిర్వహణ పనులను సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ఈపర్యటనలో సిఎంఒహెచ్ డాక్టర్ పి రత్నావళి, కార్పొరేటర్ జానారెడ్డి పాల్గొన్నారు.

నేడు పోటీ పరీక్షలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-అవనిగడ్డ : యుటిఎఫ్ అవనిగడ్డ శాఖ ఆధ్వర్యంలో ప్రగతి విద్యాసంస్థల ప్రాంగణంలో గ్రూప్స్ డివైఇఓ పోటీపరీక్షలకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి కనకారావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి గెస్ట్ లెక్చరర్‌గా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని చెప్పారు. ఇందులో భారత సమాజం ఆంధ్రుల చరిత్ర ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ పై ఉపన్యాసిస్తారని, ఇందుకు సంబంధించిన మెటీరియల్ ఉచితంగా అందిస్తారన్నారు. జీకే టిప్స్ కూడా చెప్పనున్నట్లు తెలిపారు. గ్రూప్స్ డివైఇవో పోటీ పరీక్షలకు తయారయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కనకారావు కోరారు.

వేటూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రముఖ సినీ గేయ రచయిత కీర్తిశేషులు వేటూరి సుందర రామమూర్తి జయంతిని అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో నిర్వహించారు. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ సుందరామ్మూర్తి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు సుందర మూర్తి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ ,ఎలవర్తి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మోపిదేవి : వేటూరి.సుందరరామమూర్తి జయంతి సందర్భంగా వారికి దివిసీమతో వున్న అనుబంధాన్ని మోపిదేవి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న అడపా గురవయ్య మాస్టారు గుర్తు చేశారు. సుందరరామమూర్తి తండ్రి ప్రభాకరశాస్త్రి చల్లపల్లి జమీందార్ సంస్థానంలో ఉన్నతోద్యోగంలో ఉన్నప్పటికీ ఆ నాటి పరిపాలనలో లోపాలను ధైర్యంగా రాజావారికి చెప్పగలిగిన ధీశాలి అన్నారు. .తండ్రి నుండి సరస్వతీ కటాక్షం అందుకున్న సుందరరామమూర్తి తన పాటలతో పామరుడిని సైతం చైతన్య పరిచే విధంగా తెలుగు భాష ఘన కీర్తిని ప్రపంచానికి చాటిన మహా వ్యక్తి అని అన్నారు.తనదైన శైలితో సినీరంగంలో తెలుగు నేలను సుసంపన్నం చేశారన్నారు.

నేడు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మహాత్మా గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మంగళవారం దివిసీమ లలిత కళ సమితి గ్రామీణ యువజన వికాస సమితి సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహ కమిటీ కార్యదర్శి కునపరెడ్డి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు చిత్రం లేఖనం పోటీ ఉంటుందని, మహాత్మా గాంధీ ఆశించిన స్వచ్ఛ గ్రామము అనే అంశంపై చిత్రలేఖన ఉంటుందన్నారు. అదేవిధంగా 11 గంటల నుండి 12 గంటల వరకు వ్యాసరచన పోటీలు ఉంటాయని చెప్పారు. జూనియర్స్ విభాగంలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనవచ్చునని, సీనియర్స్ విభాగంలో ఇంటర్ నుండి డిగ్రీ వరకు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 9949417719 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని చంద్రశేఖర్ కోరారు.

సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి - గుడివాడ : ఆటోనగర్‌లో దొంగతనాలను నివారించడానికి సిసి కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని గుడివాడ రెండవ పట్టణ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ది కృష్ణాజిల్లా ఇండస్ట్రీ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ జీవోనెంబర్ 1560(సిఐటియు అనుబంధం), ఆటోనగర్ కమిటీ ఆధ్వర్యంలో ఆటోనగర్ 5వ రోడ్డులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆటోనగర్‌లోని ప్రధానమైన ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సిఐ సూచించగా యూనియన్ కమిటీ అంగీకరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి బాధ్యత తీసుకుంటామని తెలిపారు. అనంతరం సిఐ వివిధ సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి లక్ష్మణరావు, ఇండస్ట్రీల వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్, కద్దూస్, రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి లక్ష్మణరావు

నాగరాజు, ఆంజనేయులు, త్రినాధ్, ఎండి మొహిద్దీన్ బాషా, వడ్లాని గాంధీ, మహాదేవ ఆదినారాయణ, రాంబాబు, జోగా నాగేశ్వరరావు, వీరంకి శంకర్, అబ్దుల్ వదుద్, రెబ్బ రాజు, శ్యామల, శంకర్, మేడా పరమేశ్వరరావు, కాజా, అన్నమనేడి రమణ, మదిరి శ్యాం కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో రూ 43.05 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి విశేషమైన కృషి చేస్తున్నారన్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని జగన్మోహన్ రెడ్డి ద్వారా సాధ్యమవుతుందన్నారు. గ్రామాలలోని అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేస్తూ దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామీణ వ్యవస్థ నిర్మాణానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తొలుత కృష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్చార్జ్ కడవకొల్లు నరసింహారావు రిబ్బన్ కత్తిరించి భవనాన్ని ప్రారంభించగా శిలాఫలకాన్ని ఎమ్మెల్యే రమేష్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు వద్రే నరేష్ బాబు పాల్గొన్నారు



మాట్లాడుతున్న బండి రామకృష్ణ

వైసిపి పతనమే లక్ష్యం : బండి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : వైసీపీ ప్రభుత్వ పతనమే లక్ష్యంగా జనసేన టీడీపీలు పనిచేస్తాయని జన సేన మచిలీపట్నం ఇన్చార్జి బండి రామకృష్ణ తెలిపారు. మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో పాల్గొని రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తారని తెలిపారు. జనసేన, టీడీపీ కలవకూడదని చాలా మంది ఎదురు చూశారని ప్రయత్నాలు కూడా చేశారని అన్నారు. జనసేన,టిడిపి పొత్తులో ఉన్నందున పొత్తు ధర్మాన్ని పాటించాలని పొత్తులు,సీట్ల విషయం ఇరు పార్టీల అధినేతలు చర్చించుకుని నిర్ణయాలు ప్రకటిస్తారని తెలిపారు. సగం సగం సమాచారంతో జనసేన టిడిపి శ్రేణులు స్పందించ చకుండా సమన్వయం పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్, జనసేన పార్టీ 8.వ డివిజన్ ఇంచార్జ్ కర్రి మహేష్, 4వ డివిజన్ ఇంచార్జ్ పినిశెట్టి వేణు పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో 'జయహో బిసి'

ప్రజాశక్తి-పెదపారుపూడి : ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనంతా బీసీల బతుకుల్ని బుగ్గి చేయడమే అన్నట్లు సాగిందని పామర్రు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి వర్ల కుమార్ రాజా ధ్వజమెత్తారు. ఆదివారం రాత్రి పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామంలో 'జయహో బీసీ ' సభలో జగన్ రెడ్డి దుర్మార్గాలపై మాట్లాడారు. జగన్ బీసీలకు చెందిన 8వేల ఎకరాల అసైన్డ్ భూములు లాక్కునాడని, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి ,నియోజకవర్గం బీసీ అధ్యక్షులు వీరంకి పరశురాం ,మూడే శివశంకర్ ,మండల కార్యదర్శి ముసిముక్కు రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి, గుడివాడరూరల్: రోడ్డు ప్రమాదంలో గుడ్లవల్లేరు సిపిఎం కార్యదర్శి బివి శ్రీనివాసరావు సోమవారం గాయపడ్డారు. ఆయన విధి నిర్వహణలో బైపాస్ రోడ్డులో సైకిల్ మీద వెళుతూ రోడ్డు పక్కన ఆగగా అతి వేగంగా మోటారు సైకిల్ నడిపిన ఇద్దరు యువకులు వచ్చి ఢీ కొట్టి అవతలకు వెళ్ళిపోయారు. పడిపోయిన బివి శ్రీనివాసరావు లేచి చేయి విరిగిపోయి ందని గ్రహించి ఒంటి చేత్తో సైకిల్ నడుపుకుంటూ ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న గుడివాడ సిపిఎం కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి ఆయన్ను గుడివాడ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ రిఫర్ చేశారు. కృష్ణాజిల్లా కార్యదర్శి రఘు చరవాణిలో సంప్రదించి మెరుగైన వైద్యానికి సిఫారసు చేశారు.

బకాయిలు విడుదల చేయాలని పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు 11వ పిఆర్‌సిలో ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ను తిరిగి పెంచాలని, పెండింగ్లో ఉన్న డిఎ అరియర్ బకాయిలకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కృష్ణ కలెక్టరేట్ ధర్నా చౌదరి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షులు జి.రామ స్వామి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని గతంలో పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నేటికీ పరిష్కారం కాలేదన్నారు.కాబట్టి తప్పని సరి పరిస్థితుల్లో రాష్ట్ర సంఘం ప్రకటించిన కార్యాచరణ లో భాగంగా సమస్యల సాధన కొరకు దశల వారి పోరాటం చేస్తామన్నారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు 11వ పి ఆర్ సి లో ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ను తిరిగి యధావిధిగా అంతకు ముందు ఇస్తున్నట్లుగా 70 సంవత్సరాలు నిండిన వారికి 10 శాతం,75 సవంత్సరాలు నిండిన వారికి 15 శాతం పునరుద్దరిం చాలని డిమాండ్ చేశారు. లేదంటే ఫిబ్రవరి 5వ తేదీన విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు కు వినతి పత్రం అందజేశారు. ఏపి ఎన్ జి ఓ స్.అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకురి. శ్రీనివాసరావు, తదితరులు సంఘీభావం తెలిపిన ఈ ధర్న లో సంఘ నాయకులు ఏవి. ప్రసాద్, శంఖర్ నాథ్ ,రామకృష్ణ, తోపాటు పెద్ద ఎత్తున పెన్షనర్లు పాల్గొన్నారు.

కారులో తరలిస్తున్న రూ.4.25 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: ఎలాంటి పత్రాలు లేకుండా నగదును తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను హనుమాన్ జంక్షన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.బాపులపాడు మండలం బొమ్ములూరు టోల్ గేట్ వద్ద సోమవారం పోలీసులు వాహన తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో కారులో తరలిస్తున్న నగదును గుర్తించారు.టోల్ గేట్ వద్ద సీఐ నరసింహామూర్తి ఆధ్వర్యంలో ఎస్సై జనార్దన్ సిబ్బందితో కలిసి వాహనతనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఏలూరు నుండి విజయవాడకు కారులో ఎటువంటి రసీదులు లేకుండా 4,25,000 వేలు తరలిస్తున్న విజయవాడ, పంజా సెంటర్కు చెందిన ఎస్.కె బాజీ, తండ్రి మీయాసాహెబ్ అని ఇద్దర్నీ పోలీసులు అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. కనీస పత్రాలు కూడా లేకుండా నగదు రవాణాను తనిఖీల్లో గుర్తించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.ఈ తనిఖీల్లో ఎస్సై తిరుమలరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నందివాడలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి - గుడివాడ(నందివాడ) : గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నందివాడ గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం సోమవారం జరిగింది. టిడిపి జనసేన పార్టీల శ్రేణులతో కలిసి ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, ఇంటింటికి తిరుగుతూ టిడిపి జనసేన మినీ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆరేకపూడి రామశాస్త్రులు, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, నందివాడ మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు యస్,తారకరామారావు పాల్గొన్నారు.

ఎన్నికల్లో టిడిపిదే విజయం : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో భారీ మెజార్టీతో తెలుగుదేశం పార్టీ అధికార పీఠం ఎక్కుతుందని గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ధీమా వ్యక్తం చేశారు. మరో మూడు నెలల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని యార్లగడ్డ తెలిపారు. రాష్ట్రంలో గత 5ఏళ్లుగా ఈ ప్రభుత్వం ప్రతిపక్షాలపై తీవ్రమైన దాడులు దాడులు చేస్తూ ప్రతిపక్ష నాయకులపై నిర్బంధం అమలు చేస్తుందని, కనీసం బ్యానర్లు కూడా కట్టనీయకుండా అడ్డుకుంటుందని సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోవడంతో అభివృద్ధి ఎక్కడ కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామికరంగం వెనుకపడి పోవడంతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలతో పాటు ఆర్టీసీ బస్సు చార్జీలు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో పేద మధ్యతరగతి వర్గాల ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.

గొర్రెపాటి చంద్రశేఖరరావు మృతి

ప్రజాశక్తి-గుడివాడ : గొర్రెపాటి ట్రస్ట్ నిర్వాహకులు గొర్రెపాటి చంద్రశేఖర రావు (83) తుదిశ్వాస విడిచారు. ఈయన చల్లపల్లి విజయ అకాడమీ కరెస్పాండెంట్, తాడేపల్లి మలయాళ స్వామి వద్దాశ్రమం సహోదారులుగా వ్యవహరి స్తున్నారు. 1960-70లో నిడుమోలు నియోజక వర్గం స్వతంత్ర పార్టీ అధ్యక్షులుగా పనిచేసారు. గత కొద్ది కాలంగా కాన్సర్ వ్యాధితో విజయవాడ కామినేని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య అన్నపూర్ణాదేవి, కుమారులు ఉదయభాస్కర్ (ఆస్ట్రేలియా), రాంబాబు (ప్రసాద్) ఉన్నారు. గొర్రెపాటి చంద్రశేఖర రావు పార్థివదేహాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాధ్ బాబు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, టిడిపి నాయకులు తుమ్మల చౌదరి బాబు, బండి పరాత్పరరావు అయినపూడి భాను ప్రకాష్, మిక్కిలినేని మధు, ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, సిపిఎం నాయకులు వాకా రామచంద్రరావు, చల్లపల్లి విజయ అకాడమీ కరస్పాండెంట్ నాగళ్ల భీమారావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



'మలబార్' స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విజయవాడలోనిమలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ అకాడమిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పేద విద్యార్థినీ, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రీజనల్ ఇంటర్మీడిటయ్ ఆఫీసర్ కె.రవికుమార్‌ల చేతుల మీదుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందచేశారు. ఈసందర్భంగా ఎం.జి.రోడ్డు మలబార్ షోరూమ్ మేనేజర్ నిఖిల్ చంద్రన్ మాట్లాడుతూ ప్రతి ఏటా మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చదువుకోసం స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామని తెలిపారు. 353 మంది విద్యార్థులకు ఒకొక్కరికి రు. 8వేలు నుండి రు. 10వేలుచొప్పున రు. 31.38 లక్షల రూపాయలు అందించినట్లు తెలిపారు. మలబార్ సంస్థ విద్య కోసం స్కాలర్‌షిప్‌లతో పాటు పలు సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుందన్నారు. పేదలకు గృహ నిర్మాణం కోసం కూడా మలబార్ హౌసింగ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తగిన విధంగా ఆర్థిక సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో మలబార్ స్టోర్ హెడ్ అర్జున్ పాల్గొన్నారు.

'లోహాలపై దిగుమతి సుంకం తగ్గించాలి'

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: రానున్న మధ్యంతర బడ్జెట్‌లో విలువైన లోహాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని భీమా గోల్డ్ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణు శరణ్ భట్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన లోహాలపై దిగుమతి సుంకం తగ్గింపు రత్నాలు, ఆభరణాల పరిశ్రమకు ఆశాజనకమైన పరిణామంగా నిలుస్తుందన్నారు.ఈపరిశ్రమ ముడి పదార్థాల దిగుమతిపై ఆధారపడి ఉండటం వలన దిగుమతి సుంకం ప్రస్తుత 15 శాతం నుండి 4 శాతం వరకు తగ్గింపు జరగాలనానరు. తగ్గింపు జరిగితే ముడి పదార్థాల లభ్యత అవకాశాలను మెరుగుపరచడం ద్వారా ఈ రంగానికి గణనీయమైన ప్రోత్సాహాన్ని అందించవచ్చని తెలిపారు. ఆవిధంగా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు.

అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్షా ఫౌండేషన్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 40 రోజులపాటు పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సేవకు ప్రతిరూపంగా రక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 14 సంవత్సరాలుగా నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు అందరూ అంకితభావంతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు పడమట సురేష్ బాబు, హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మౌలిక వసతులు కల్పించలేని పాలకులెందుకు?

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు ఆగ్రహం

ప్రజాశక్తి-అజిత్ సింగ్‌నగర్: ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించలేని పాలకులు అధికారంలో ఉండి ఏం లాభమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలోని 62వ డివిజన్ రాధానగర్లోని సెవెన్ అపార్ట్మెంట్ కాలనీలో ఎల్‌బిఎస్ నగర్‌లో నివాసముంటున్న ప్రజలకు గత కొన్ని రోజులుగా మంచినీరు సరఫరా కాకపోవడంపై సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు. విజయవాడలోని రాధానగర్లోని కాలనీలో గత కొన్ని రోజుల నుంచి మంచినీరు సరఫరా కావడంలేదన్నారు. మోటర్లు ఉంటే కొంతమందికి మాత్రమే వస్తున్నాయని, మోటర్ లేని వరకు మాత్రం బిందెడు నీళ్ల కూడా రావడంలేదని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, పైపులు పగిలి మురికి నీరు రోడ్లపైకి వస్తుందని, కాలనీ మొత్తం దుర్వాసన వస్తుందని చెప్పారు. దోమలు అధికంగా చేరి ప్రజలపై దాడి చేస్తున్నాయని, ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రజలపై ఛార్జీల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ప్రభుత్వం వారికి కనీస వసతులు


మాట్లాడుతున్న బాబూరావు

కల్పించడంలేదని ఆగ్హ్రం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ కార్యదర్శి బి రమణారావు, సిఐటియు సిటీ నగర అధ్యక్షులు కే దుర్గారావు, సిఐటియు సిటీ నగర్ నాయకులు సాంబిరెడ్డి, బి రాంబాబు, డివైఎఫ్ఐ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో కుల గణన సర్వే కార్యక్రమం వేగవంతం చేసి ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డి ఆర్వో పెద్ది రోజా, జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కులగణన, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, ధాన్యం సేకరణ, ఆడుదాం ఆంధ్ర, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 85.94 శాతం కుల గణన సర్వే పూర్తయిందని, సర్వేను మరింత వేగవంతం చేసి మిగిలిన సర్వే ఈనెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. సర్వేలో తాడిగడప, మచిలీపట్నం, ఉయ్యూరు, పెడన ప్రాంతాల్లో సర్వే శాతం జిల్లా సరాసరితో పోలిస్తే కొంత తక్కువగా ఉందని ప్రత్యేక శ్రద్ధ వహించి ఆ ప్రాంతాల్లో సర్వేను పూర్తి చేయాలన్నారు. ధాన్యం సేకరణలో భాగంగా గోనె సంచులు కొరత రాకుండా పర్యవేక్షించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు తలెత్తే సమస్యలను అధిగమించాలని కలెక్టర్ సూచించారు.



ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: గుణదల మేరిమాత ఆలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా క్రీస్తురాజపురం, మొగల్‌రాజపురం తదితర ప్రాంతాలలో లూర్ధుమాత మేరిమాత స్వరూపాన్ని పలు ప్రాంతాలలో స్థానికులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా మేరిమాత స్వరూపానికి పూల మాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ ప్రకాష్ మాట్లాడుతూ గుణదల పుణ్యక్షేత్రంలో మేరిమాత ప్రతిష్టించబడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. విశేషంగా పూజలు అందుకుంటూ ఎంతో మంది భక్తుల కోర్కెలను నెరవేరుస్తుందన్నారు. బందుల దొడ్డి సెంటర్, సున్నపుబట్టీలు, క్రీస్తురాజపురం వరకు మేరిమాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు నిర్వహించినట్లు తెలిపారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైనవారు మేరిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి జపమాలతో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మఠకన్యలు సిస్టర్ టేక్లా, ఉపదేశులు పలిపె ఫ్రాన్సిస్, స్థానిక పెద్దలు పెట్టరాజకుమార్, మరియు తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో 'ఎస్ఆర్ఆర్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఈనెల 28వ తేదీన కడపలో జరిగిన రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌లో నగరంలోని ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమి విద్యార్థులు ప్రతిభ కనపరచి పతకాలు సాధించారని అకాడమి ప్రెసిడెంట్ జె.సౌజన్య తెలిపారు. ఈసందర్భంగా నగరంలోని అకాడమి ప్రాంగణంలో సోమవారం ఉదయం ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా సౌజన్య మాట్లాడుతూ అండర్ -14 కేటగిరిలో తమ విద్యార్థి కె.సందీప్ ఐదు పాయింట్లు సాధించి ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం, రూ.వెయ్యి నగదు బహుమతి అందుకున్నాడని తెలిపారు. అలాగే అండర్ -15 కేటగిరిలో లాస్య నాలుగు పాయింట్లు సాధించి గోల్డ్ మెడల్ రు. 1000లు నగదు బహుమతి అందుకుందని తెలిపారు. మరో విద్యార్థిని ఇదే కేటగిరిలో రిషితా శాన్వి ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్ రూ.వెయ్యి నగదు బహుమతి అందుకుందని



తెలిపారు. టి.జివితేష్ నాలుగు పాయింట్లు సాధించి మూడవ స్థానం పొంది బ్రాంచ్ మెడల్ అందుకున్నాడని తెలిపారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు క్రీడాకారులను అభినందించి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానానికి వెళ్లాలని ఆకాంక్షించారు.

నూతన ఆవిష్కరణపై విద్యార్థులు దృష్టి సారించాలి

ఎఫ్‌ట్రానిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకృష్ణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులు నూతన ఆవిష్కరణల పట్ల దృష్టి సారించాలని, కొత్తదనంతో ఆలోచించి మార్గనిర్దేశనం చేసుకవాలని ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకృష్ణ అన్నారు. మొగల్‌రాజపురంలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ నిపుణులకు మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సును సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులలో అద్భుతమైన మేధో శక్తి ఉందని దానికి అనుగుణంగా విద్యార్థులు ఎప్పటికపుడు కొత్త అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు బేసిక్ ప్రోగ్రామింగ్, లాంగ్వేజెస్ , ఆల్‌గారిథమ్స్‌లో పట్టు సాధించాలని దాని ద్వారా మంచి ఉపాధి అవకాశాలు కూడా పొందవచ్చని తెలిపారు. సిద్దార్ధ కళాశ్శాల ఎప్పటికపుడు విద్యార్థులకు నూతన ట్రెండ్‌కు అనుగుణంగా విద్యా విధానాన్ని అందిస్తుందని అందులో భాగంగానే అంతర్జాతీయ స్థాయి నిపుణులతో సెమినార్ ఏర్పాటుచేసిందని అన్నారు. ఈసందర్భంగా కళాశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అమెరికాకు చెందిన బి.ప్రియథమ్ కంప్యూటర రంగంలో వస్తున్న నూతన మార్పులు, విధానాలు గురించి విద్యార్థులకు తెలియచేశారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు విద్యను అందిస్తున్నామన్నారు. విద్యతో పాటు ఉపాధి, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించాలనే ఉద్దేశంతో వివిధ విశ్వవిద్యాలయాలు, నిపుణులతో సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగపూర్‌కు చెందిన దీపక్


మాట్లాడుతున్న రామకృష్ణ

గుప్తా, యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ అప్లయిడ్ సైన్సెస్‌కు చెందిన ఆచార్యులు డాక్టర్ పి.గోపీకృష్ణ, డాక్టర్ ప్రతాపరాజు, డాక్టర్ మెహదీ, పలువురు పాల్గొని నూతన విధానాలు గురించి తెలియచేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ రాజేష్ సి జంపాల, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ టి.ఎస్.రవికిరణ్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, సెమినార్ కో కన్వీనర్ జి.సాయిరామ్, కె.సుధీర్, కె.ఉదయశ్రీ పాల్గొన్నారు.